క్లుప్తంగా

నేడు వీఎంసీలో పీజీఆర్ఎస్

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగరంలోని మూడు నియోజకవర్గాల్లో మౌలిక వసతుల కల్పనలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు వీఎంసీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు, పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం, చిట్టినగర్‌లోని సర్కిల్–1, సత్యనారాయణపురంలోని సర్కిల్–2, పటమటలోని సర్కిల్–3లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. వీఎంసీ పరిపాలన విభాగంలోని జోనల్ కమిషనర్, వివిధ శాఖాధిపతులు, సర్కిల్ స్థాయి అధికారులు పాల్గొని ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లేజిస్లేటివ్ అదనపు కార్యదర్శిగా రామిశెట్టి



విజయవాడస్పోర్ట్స్: కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ లేజిస్లేటివ్ అదనపు కార్యదర్శిగా రామిశెట్టి శ్రీనివాస్‌ను నియమిస్తూ అపాయింట్‌మెంట్ కమిటీ ఆఫ్ కేబినేట్ ఇటీవల అధికారిక ప్రకటన చేసింది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా శ్రీనివాస్ ఇండియన్ లీగల్ సర్వీస్‌కు ఎంపికై కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖలో ఉప కార్యదర్శిగా పని చేశారు. జీఎస్టీ, రెరా, పర్సనల్ డేటా ప్రొటెక్షన్, సరోగసి చట్టాల సవరణల్లో కీలకంగా వ్యవహరించారు. గుంటూరుకు చెందిన శ్రీనివాస్ విద్యాభ్యాసం మచిలీపట్నంలో కొనసాగింది. కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ లెజిస్లేటీవ్ అదనపు కార్యదర్శిగా శ్రీనివాస్‌ను నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కృష్ణమ్మ హారతులకు మరింత ప్రాచుర్యం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పవిత్ర కృష్ణమ్మ పంచహారతులకు మరింత ప్రాచుర్యం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు దుర్గగుడి ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. దుర్గాఘాట్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కృష్ణమ్మ హారతులకు దుర్గగుడి ఈవో శీనానాయక్ హాజరయ్యారు. తొలుత ఆలయ అర్చకులు కృష్ణానదికి పూజా కార్యక్రమాలను నిర్వహించగా, ఈవో పసుపు, కుంకుమను సమర్పించారు. అనంతరం భక్తులతో కలిసి కూర్చుని పంచహారతులను వీక్షించారు. సాయంం సమయంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో, ఆధ్యాత్మిక భావనను పెంపొందించే పంచహారతులకు మరింత మంది భక్తులు విచ్చేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో అనకాపల్లికి చెందిన శ్రీవెంకట సాయి డ్యాన్స్ అకాడమీకి చెందిన చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఆదివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శిరీష పర్యవేక్షణలో 24 మంది చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. సుమారు రెండు గంటల పాటు సాగిన నృత్య ప్రదర్శన ఆద్యంతం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది.

చీదెళ్లకు ఆత్మీయ సత్కారం

విజయవాడ కల్చరల్: జయహో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పితృ దినోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని ఒక హోటల్‌లో అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు న్యాయవాది చీదెళ్ల నాగేశ్వరరావును నిర్వాహకులు ఆదివారం ఆత్మీయంగా సత్కరించారు. సంస్థ వ్యవస్థాపకురాలు కె.జయశ్రీ, సాహితీ సంస్థల ఐక్యవేదిక అధ్యక్షుడు బోడి ఆంజనేయరాజు, రమాదేవి పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- శ్రవణా నక్షత్రం నేపథ్యంలో అభిషేకాలు
- వైభవంగా వసంతోత్సవం, చక్రస్నానం
- స్వామివారిని దర్శించుకున్న భారీ భక్తజనం



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



స్వామివారికి పంచామృత అభిషేకాలు చేస్తున్న అర్చకులు



విశేషాలంకరణలో మూలవిరాట్



స్వామివారికి చక్రస్నానం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గోవింద నామస్మరణతో ఆదివారం చిట్టినగర్ మార్మోగింది. శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు పూర్ణాహుతితో పరిసమాప్తమయ్యాయి. ఉత్సవాల ముగింపు, స్వామి వారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున పంచామృత అభిషేకాలు, అర్చనలు చేశారు. తొలుత స్వామి వారికి ఆలయ అర్చకులు సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి నిర్వహించిన అభిషేకాలను వీక్షించేందుకు పెద్దఎత్తున భక్తులు, ఉభయదాతలు తరలివచ్చారు. భక్తుల సమక్షంలో ఆలయ అర్చకులు ధాన్యకోట్సోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో వసంతోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అవభృత్సోవం, చక్రస్నానం వంటి కార్యక్రమాలను ఆలయ అర్చకులు జరిపించారు. యాగశాలలో మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు వినుకొండ రత్నమాచార్యులు, మురికిపూడి మణిదీప్‌కుమార్ శిష్యబృందం నిర్వహించారు.

పవళింపు సేవ..

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామి వారికి ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ నిర్వహించారు. శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివార్ల ఉత్సవమూర్తులతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించిన అనంతరం కల్యాణ మండపంలో పవళింపు సేవ నిర్వహించారు. ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. స్వామి వారిని గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, విజిలెన్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, ఇతర ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులకు ఆలయ కమిటీ సెక్రటరీ మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు ప్రసాదాలను అందచేశారు. కార్యక్రమంలో చింతాడ రాము, మాకిన సత్యనారాయణ, రాంపిళ్ల వాసు, నాగోతి వాసు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యకోట్సోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వృద్ధుల హక్కుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధుల హక్కుల పరిరక్షణపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినం సందర్భంగా ఆదివారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధులకు ఆత్మీయతను పంచి సమాజంలో గౌరవంగా జీవించేలా చూడాలన్నారు. వారికి సంబంధించిన సమస్యలపై అందే ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. స్విట్జర్లాండ్ తరహాలో వృద్ధులకు సేవ చేసి క్రెడిట్స్ పోగేసుకుని అవసరమైనపుడు తిరిగి ఉపయోగించుకొనే టైం బ్యాంక్ విధానాన్ని జిల్లాలో అమలుచేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. న్యూక్లియర్ కుటుంబాల నేపథ్యంలో చిన్నారులు, విద్యార్థులకు వృద్ధులతో ఇంటరాక్షన్ సెషన్స్ నిర్వహించే విషయమై ఆలోచన చేస్తున్నామన్నారు. వయో వృద్ధులు చెప్పే చిన్న కథే జీవితానికి ఓ గొప్ప పాఠమన్నారు. ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన కార్డులు పొందేందుకు వృద్ధులు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారచు. పీజీఆర్ఎస్ తరహాలో వృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా నెలలో ఒక రోజు ప్రత్యేకంగా అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ వివరించారు.

మోసాలపై అవగాహన..

సీనియర్ సిటిజన్స్ స్టేట్ కౌన్సిల్ కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేరగాళ్లకు మోసగాళ్లకు వృద్ధులే మొదటి టార్గెట్ అన్నారు. సైబర్ మోసాల వంటి వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వాసవ్య మహిళా మండలి అధ్యక్షులు డాక్టర్ బి. కీర్తి మాట్లాడుతూ ఓల్డేజ్ హోం వృద్ధులకు సహాయకులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహం, జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వేమూరు బాబూరావు, వి. కామరాజు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తల్లికి వందనం పేరిట పంగనామం

వడిత్యా శంకర్ నాయక్



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏడాది పాలనలో ఇచ్చిన ఏ హామీలను అమలు చేయని కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరిట పంగనామం పెడుతోందని గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్ నాయక్ విమర్శించారు. ముత్యాలంపాడులో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. అమ్మ ఒడి పేరిట మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తల్లుల ఖాతాలలో ఏటా కచ్చితంగా నగదు జమ చేశారని గుర్తు చేశారు. మనబడి నాడు–నేడు పేరిట ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా తయారు చేశారన్నారు. కూటమి పాలనలో విద్యావ్యవస్థను నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికీ ఏటా రూ.15 వేల తల్లికి వందనం అమలు చేస్తామంటూ హామీలు ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు ఏడాది గడిచిన తరువాత తూతూ మంత్రంగా కేవలం ఒక్కొక్కరికి రూ.13 వేలు ఇవ్వటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పట్లో తల్లుల ఖాతాలలో రూ.14 వేలు జమ చేస్తే వ్యతిరేకించిన లోకేశ్ ఇప్పుడు రూ.13 వేలు మాత్రమే ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. నిబంధనల పేరిట తల్లికి వందనంనకు పంగనామం పెడుతున్నారని విమర్శించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ తల్లికి వందనం ఇవ్వాలని వడిత్యాశంకర్ నాయక్ డిమాండ్ చేశారు.

యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా సాధకులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ



పున్నమిఘాట్‌లో యోగాసనాలు సాధన చేస్తున్న ఔత్సాహికులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రపంచానికి మనదేశం అందించిన గొప్ప సంపద యోగా అని, క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ పేర్కొన్నారు. భవానీపురంలోని పున్నమిఘాట్‌లో ఆదివారం యోగాసనాలు సాధన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 5వేల మంది ట్రినర్లతో 10లక్షల మందికి యోగా నేర్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 170కిపైగా దేశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించడం దేశానికి గర్వకారణమన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్య, ఆనందమయ జీవితాన్ని గడపవచ్చన్నారు. యోగాతో ఒత్తిడిని జయించవచ్చని, తద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అప్‌కాస్ట్ రీజనల్ సైన్స్ సెంటర్ మెంబర్ సెక్రటరీ కె.శరత్‌కుమార్, పశ్చిమ ఎమ్మెల్యే ఆఫీస్ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కాలేజి హెచ్ఓడీ డాక్టర్ యుగంధర్, యోగా శిక్షకురాలు శిరీష, పలువురు యోగా సాధకులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రతిభాశాలి మహాకవి శ్రీశ్రీ



తమ్మారెడ్డి భరద్వాజకు శ్రీశ్రీ పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, కొల్లూరి, గుప్తా

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి మహాకవి శ్రీశ్రీ అని సినీ దర్శకుడు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని జీవీఆర్ కళాశాలలో ఆదివారం శ్రీశ్రీ 42 వర్ధంతి సభ, తమ్మారెడ్డి భరద్వాజకు మహాకవి శ్రీశ్రీ స్మారక పురస్కార సభను ఆదివారం నిర్వహించారు. పురస్కారం అందుకున్న భరద్వాజ మాట్లాడుతూ తెలుగు సినిమాపాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన కవి శ్రీశ్రీ అన్నారు. ప్రభోదాత్మక గీతాలైన, కరుణ రసాత్మకమైన గీతాలైన, విషాద గీతాలైన అద్భుతంగా రాయగల నేర్పు శ్రీశ్రీ దన్నారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ మహాకవి శ్రీశ్రీ కవిత్వం ఎందరో యువ కవలకు స్ఫూర్తిగా నిలిచిందని చెప్పారు. అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు పాటకు సాహిత్య విలువలను అందిచిన కవి శ్రీశ్రీ అన్నారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి సంస్థ లక్ష్యాలను వివరించారు. డెప్యూటీ కలెక్టర్ కొమ్మెర్ల కృష్ణవేణి, సింగంపల్లి అశోక్‌కుమార్, రావి కృష్ణారావు, రామలింగరాజు పాల్గొన్నారు. ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు, సభ్యులు సీహెచ్‌వీ సుబ్బయ్య, రవి కిరణ్ పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమానికి కార్యాచరణ

శాతవాహన కళాశాల పరిరక్షణ కమిటీ సమావేశంలో నిర్ణయం



శాతవాహనా కళాశాల పరిరక్షణ కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):శాతవాహన కళాశాలకు చెందిన భూములను ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని ప్రభుత్వమే కళాశాలను నిర్వహించాలని శాతవాహన కళాశాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ వీ.సాంబిరెడ్డి డిమాండ్ చేశారు. శాతవాహన కళాశాల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆ కళాశాల పూర్వ విద్యార్థులు, రిటైర్డ్ అధ్యాపకుల సమావేశం (గెట్ టూ గెదర్) విశాలాంధ్ర పత్రిక కార్యాలయ ఆవరణలో ఆదివారం జరిగింది. వి.సాంబిరెడ్డి మాట్లాడుతూ న్యాయ పోరాటం చేసైనా కళాశాలను రక్షించుకుంటామని తెలిపారు. కమిటీ కో–కన్వీనర్ డీ.విష్ణువర్ధన్, కో–కన్వీనర్స్ ఎం.అరుణ్‌కుమార్, ఎస్.సాంబశివరావు, పూర్వ విద్యార్థులు బైపూడి నాగేశ్వరరావు, సైనుద్దీన్, శ్రీనివాసరావు, కిరణ్, రవిచంద్ర, రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ (డీఎస్ఎంసీ) హైస్కూల్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. పదోతరగతిలో 500పైన మార్కులు వచ్చిన 17మంది విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.అన్నపూర్ణ, కె.జ్యోతిర్మయి, పి.వాణి కలిసి రూ.25వేల నగదు, బహుమతులను బహూకరించారు. పాఠశాల హెచ్ఎం బాలాజీ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటులగా మంచి ఫలితాలను సాధించారంటూ విద్యార్థులను అభినందించారు.

బదిలీపై వెళ్లిన హెచ్ఎంకు సత్కారం..

డీఎస్ఎంసీ హైస్కూల్ నుంచి దుర్గాపురంలో ఎస్‌టీవీఆర్ మున్సిపల్ హైస్కూల్‌కు బదిలీపై వెళ్లిన స్కూల్ హెచ్ఎం మాతంగి కోటయ్యను ఘనంగా సత్కరించారు. కోటయ్య మాట్లాడుతూ పాఠశాల నిర్వహణలో తనకు సహకరించిన ఉపాధ్యాయులు, సిబ్బందికి తన కృతజ్ఞతలు తెలియజేశారు. హైస్కూల్ ఉపాధ్యాయులు ప్రసాద్, మురళీప్రసాద్, శివ పార్వతి, నాగరాజు పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యంపై ఫిర్యాదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):ఓ బాలుడు అదృశ్యమైన ఘటన భవానిపురం పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన పాతూరి జ్యోత్స్న బెంగుళూరులో సాఫ్ట్‌వేర్‌జాబ్ చేస్తోంది. ఆమెకు ఇద్దరు సంతానం. పెద్దబ్బాయి హేమకేష్ ఏడోతరగతి చదువుతూ విద్యాధరపురంలోని పెద్దమ్మ వాళ్ల ఇంట్లో ఉంటున్నాడు. ఈక్రమంలో హేమకేష్ బెంగుళూరు నుంచి తల్లి జ్యోత్స్న వచ్చిన విషయం తెలిసి, ఆదివారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో జక్కంపూడి వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరి వెళ్లాడు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో బాలుడి పెద్దమ్మ, జ్యోత్స్నకు ఫోన్‌చేసి హేమకేష్ అక్కడే ఉన్నాడా? అని ఆరా తీసింది. ఇక్కడికి రాలేదని సమాధానమిచ్చిన తల్లి జ్యోత్స్న చుట్టుపక్కల వారిని వాకబు చేసింది. అయినప్పటికీ హేమకేస్ ఆచూకీ లభించకపోవడంతో తన కుమారుడు కనిపించడం లేదంటూ భవానిపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



స్వామి వారి కల్యాణోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):వన్‌టౌన్‌లోని బ్రాహ్మణవీధిలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారికి శాంతి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. జ్యేష్ఠ మాసంలో వచ్చిన శ్రవణ నక్షత్రం కావటంతో అత్యంత పవిత్రమైనదిగా భావించి భక్తులు తరలివచ్చారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ మండపంలో ఆలయ అర్చకస్వాములు పీ.రామచంద్రమూర్తి పర్యవేక్షణలో స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవోపేతం జరిపించారు. తొలుత విష్వక్సేనపూజతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం మహాసంకల్పం, ప్రవర, యజ్ఞపవీతధారణ, జీలకర్రబెల్లం ధారణ, మంగళ్యధారణ, చివరిగా తలంబ్రాల సమర్పణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.

మూలవిరాట్‌కు తిరుమంజనం..

స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలోని స్వామివారి మూలవిరాట్‌కు తిరుమంజన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో స్వామి వారిని అభిషేకించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆయా వైదిక కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించారు.

ఇంజినీరింగ్ అధికారులపై ఈవో ఆగ్రహం



ప్లాంట్ నిర్వహణపై ఆరా తీస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గమ్మ ఆలయ భూముల్లో ఏర్పాటు చేసిన పోలార్ ప్లాంట్ ద్వారా పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఈవో శీనానాయక్ ఆదేశించారు. పాతపాడులోని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానానికి చెందిన పొలాల్లో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను ఆదివారం ఈవో శీనానాయక్ పరిశీలించారు. సోలార్ ప్లాంట్ విస్తీర్ణం, రోజు వారీ ఉత్పత్తి, దేవస్థానానికి వినియోగించే విద్యుత్ తదితర అంశాలను ఆలయ ఏఈ సునీల్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన రికార్డులను పరిశీలించిన ఈవో, ప్లాంట్‌లో పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయలేకపోవడానికిగల కారణాలను ఇంజినీరింగ్ విభాగం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దేవస్థానానికి చెందిన మొత్తం ఐదెకరాల 85 సెంట్ల విస్తీర్ణంలో ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు అధికారులు ఈవోకు వివరించారు. ప్రస్తుతం నెలకు 1.20 లక్షల యూనిట్ల ఉత్పత్తి అవుతోందని, ఇంద్రకీలాద్రిపై నెలకు లక్ష యూనిట్ల వినియోగం జరుగుతుందని పేర్కొన్నారు. మిగిలిన 20 వేల యూనిట్లకు సంబంధించి నెట్ మీటరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సోలార్ ప్లాంట్ నిర్వహణ సక్రమంగా లేదంటూ ఇంజినీరింగ్ అధికారులు ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాంట్ నిర్వహణ మెరుగ్గా ఉంటే విద్యుత్ ఉత్పత్తి మరింత పెరిగేదన్నారు. వారం రోజుల్లో పరిస్థితి మార్పు రాకుంటే చర్యలు తప్పవని ఈవో హెచ్చరించారు. ఈవో వెంట పలువురు ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

67 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అక్రమంగా విక్రయిస్తున్న 67 మద్యం బాటిళ్లను విజయవాడ కొత్తపేట పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. జక్కంపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని పోలవరం కాల్వ గుడి వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సెక్టార్ ఎస్ఐ హరిప్రసాద్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మేకపోతు చెన్నారావు(52) మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడి వద్ద 67 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ





అంతరాలయ దర్శనం రద్దు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ దర్శనానికి ఆదివారం పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున ఆరు గంటల నుంచే అన్ని క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడుతూ కనిపించాయి. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఘాట్‌రోడ్డు, మహామండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్నారు. భక్తుల రద్దీ అంతకంతకు పెరుగుతూ ఉండటంతో ఉదయం 10గంటల నుంచే అంతరాలయ దర్శనం నిలిపివేయాలని ఆలయ ఈవో శీనానాయక్ సిబ్బందిని ఆదేశించారు. అంతరాలయ దర్శనం నిలిపివేయడంతో భక్తులు రూ.300 టికెట్లు కొనుగోలుచేసి బంగారు వాకిలి దర్శనం చేసుకున్నారు. రద్దీ అధికంగా ఉండటంతో రూ.300తోపాటు రూ.100 టికెటు కొనుగోలు చేసిన భక్తులకు మూడు క్యూలైన్ల ద్వారా త్వరతిగతిన అమ్మవారి దర్శనం అయ్యేలా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఈవో తనిఖీలు..

భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ ఈవో శీనానాయక్, ఈఈ కోటేశ్వరరావు ఘాట్‌రోడ్డులోని చెప్పుల స్టాండ్, క్లోక్‌రూమ్, దేవస్థాన బస్సులను తనిఖీ చేశారు. చెప్పుల స్టాండ్, సెల్‌ఫోన్ కౌంటర్ వద్ద భక్తులు గుంపులు గుంపులుగా నిల్చోవడంతో సెక్యూరిటీ సిబ్బందిని నియమించి క్యూలైన్లను క్రమబద్ధీకరించారు. ఘాట్‌రోడ్డులో దేవస్థానం ఏర్పాటు చేసిన ఈ టాయిలెట్స్‌కు తాళాలు వేసి ఉండటంతో ఈవో శానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి నుంచి నడుచుకుంటూ టోల్‌గేట్ వద్దకు చేరుకుని కొండపైకి వచ్చే వాహనాలను పరిశీలించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులందరికీ ఉచిత ప్రసాదాలతోపాటు అన్న ప్రసాదం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం రద్దీ కొనసాగింది. రాత్రి 9గంటల వరకు భక్తులు పెద్దఎత్తున ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

